క్లుప్తంగా

ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఆర్డర్లు



ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇస్తున్న ఎంఈఓ పాపునాయుడు, తదితరులు

పూసపాటిరేగ: మండలానికి నూతనంగా వచ్చిన 1998 డీఎస్సీ ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారి పాపునాయుడు శనివారం పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. 20 మంది ఉపాధ్యాయులకు స్థానాలు కేటాంచారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పతివాడ అప్పలనాయుడు, ఎం.మంగమ్మ, ఈఆర్ఎస్ ప్రసాద్, లక్ష్మణరావు, వై.సత్యం, తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

నెల్లిమర్ల: నగర పంచాయతీ, మండలానికి సంబంధించి విద్యుత్ శాఖ ఏఈగా డి. పిచ్చయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జిల్లా మల్కాపురం ఏఈగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు సబ్ ఇంజినీర్ ఆనంద్ ఏఈగా అదనపు బాధ్యతలు నిర్వహించిన విషయం తెలిసిందే. నెల్లిమర్ల పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూస్తానని ఏఈ పిచ్చయ్య తెలిపారు.

సెలవు రోజూ బిల్లులు చెల్లించొచ్చు..

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ బిల్లుల వసూలు కౌంటర్లు ఆదివారం కూడా పనిచేస్తాయని విద్యుత్‌శాఖ ఎస్ఈ ముువ్వల లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో కూడా బిల్లులు చెల్లించవచ్చునని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సేవా సంస్థల కృషి ఎనలేనిది..

విజయనగరం టౌన్: విద్యార్థుల అభ్యున్నతికి సేవా సంస్థలు చేస్తున్న కృషి ఎనలేనిదని కార్పొరేటర్ సయ్యద్ గౌస్ (షకీల్) అన్నారు. శనివారం స్థానిక ఆబాద్ వీధి ఉర్దూ పాఠశాలలో ముస్లిం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత సేవారంగంలో తరించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అమానుల్లా, సులైమాన్, డాక్టర్ ఎజాజ్, సయ్యద్ రియాజ్, రహమ్‌తుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాల నిర్వహణ అభినందనీయం

విజయనగరం: పేద వర్గాలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించడం ప్రశంసనీయమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. శనివారం స్థానిక వీటీ అగ్రహారం వద్ద జయభేరి సంస్థ కార్యాలయంలో విజయ బ్లడ్ బ్యాంక్, విజయదుర్గ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య, రక్తదాన శిబిరాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, శిబిరాలకు సహకరించిన ఆస్పత్రుల యాజమాన్యాలను అభినందించారు. విజయనగరంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను ఆదుకునేందుకు పలు సంస్థలు తరచూ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాయని శ్రావణి తెలిపారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సకాలంలో 'నాడు - నేడు' పనులు

పూసపాటిరేగ: 'నాడు - నేడు' పనులు సకాలంలో పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి బి. శాంతకుమారి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నాడు - నేడు పనుల్లో భాగంగా పాఠశాలలో ఫేజ్-2 కింద మంజూరైన పనులు పూర్తి చేసి నివేదికలు ఇవ్వాలని సర్వశిక్షా అభియాన్ ఏఈ వెంకటరమణను ఆదేశించారు. అలాగే ఫేజ్ -3 పనులు కూడా త్వరగా ప్రారంభించాలన్నారు. పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న సేవలను వైద్యాధికారి రాజ్‌కుమార్ వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ జి.రామారావు, సీడీపీఓ ఎస్వేరురాణి, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా గృహనిర్మాణాలు

విజయనగరం టౌన్: గుంకలాం లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్ జీవీ ప్రసాద్ (విజయవాడ) అన్నారు. సచివాలయాల ఎమినిటిస్ ఇన్‌చార్జెస్, హౌసింగ్ ఏజెంట్లతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందరి సమష్టి కృషితో నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద కాలనీగా పేరుగాంచిన గుంకలాం జగనన్న కాలనీలో చిన్న చిన్న సమస్యలు నెలకొన్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులను సంప్రదిస్తామన్నారు. అవసరమైతే జిల్లా పోలీస్ యంత్రాంగం సపోర్ట్ తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యుత్, వాటర్ అందుబాటులో ఉండడం వల్ల ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతుండడం ఆనందదాయకంగా ఉందన్నారు. కాలనీల్లో చెట్లు నాటించే కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రమణమూర్తి, డిప్యూటీ డీఈ జీవీ రంగారావు, ఈఈ శ్రీనివాస్, డీఈ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట..

- కార్పొరేషన్ స్థాయికి తగ్గట్లుగా నగర సుందరీకరణ
- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కోలగట్ల శ్రావణి, తదితరులు

విజయనగరం: నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు నియోజకవర్గ శాసనసభ్యుడు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పెద్దపీట వేస్తున్నారని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తెలిపారు. కార్పొరేషన్ స్థాయికి తగ్గట్లుగా నగర సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. నగరంలోని 14వ డివిజన్ పరిధి కొత్తపేట గోకుల్ పార్క్ నుంచి శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని చదివి వినిపిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లు అందజేశారు. దళారుల బెడద లేకుండా, పూర్తి పారదర్శకంగా పథకాలు అందుతున్నాయని ఈ సందర్భంగా ప్రజలు ఆమెకు వివరించారు. ఇదే సమయంలో స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు సంగీత, సచివాలయ కన్వీనర్ దువ్వాడ తిరుమలరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యేగా గెలిచిన దగ్గర నుంచి ప్రతిరోజూ కోలగట్ల వీరభద్రస్వామి ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గడప గడపకు 'జగనన్న సురక్ష'

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలి
- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వచ్చే నెల 1వ తేదీ నుంచి గడపగడపకు తీసుకెళ్లాలని, వలంటీర్లు, గృహసారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యమై ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. గజపతినగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఇంటి తలుపుతట్టి విద్యార్థులు, రైతులకు అవసరమైన ధ్రువపత్రాలు, సేవలు అందజేయడమే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యమన్నారు. గ్రామాలకు వచ్చే తహసీల్దార్, ఎంపీడీఓలతో కూడిన బృందాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమ తీరును క్షేత్ర స్థాయిలో తనతో పాటు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారన్నారు. రూపాయి చెల్లించకుండా 11 రకాల ధ్రువపత్రాలు పొందవచ్చన్నారు. త్వరలో లింగావలస, గడబవలస, ఎమ్.గుమడాం, వసంత, అన్నం రాజుపేట, కనిమెరక, దేవుపల్లి తదితర గ్రామాల రోడ్ల పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. గతంలో టీడీపీ నేతలు దోచుకోవడం, దాచుకోవడానికే మొగ్గుచూపి ప్రజలను కష్టాలకు గురిచేశారన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, పార్టీ నాయకుడు నారాయణమూర్తిరాజు, జెడ్పీటీసీ సభ్యుడు గారతవుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, వ్యవసాయసలహా మండలి అధ్యక్షుడు సామంతుల పైడిరాజు, బెల్లాన త్రినాథరావు, పి.నారాయణమూర్తి, దొగ్గదేవుడుబాబు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జనాప్రసాద్, తదితరులు

విజయనగరం టౌన్: విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనాప్రసాద్ అన్నారు. ఏపీలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయాలకు ధూప దీప నైవేద్యాలకు సంబంధించి రూ. 5 వేలు అందించే పథకం వర్తిస్తుందని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మారోజు శ్రీనివాస్, జిల్లా గౌరవాధ్యక్షుడు కె. నాగేశ్వరరావు, కోశాధికారి అప్పలరాజు, అధ్యక్షుడు లక్కోజు శేఖర్, నాని, శ్రీను, దేవుడు, వరహాచారి, సురేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు ప్రారంభించాలి



దెంకాడ : కాలనీ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

దెంకాడ: జగనన్న కాలనీల్లో ఇంతవరకు నిర్మాణాలు చేపట్టిన వారు తక్షణం ప్రారంభించాలని ఎంపీడీఓ స్వరూపారాణి కోరారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని అమకాం జగనన్న లే అవుట్‌ను శనివారం సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడారు. అలాగే గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు.

జగనన్న కాలనీ సందర్శన..



నెల్లిమర్ల: లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్, డీఈఈ మురళీమోహన్

నెల్లిమర్ల: పట్టణంలో అర్బన్ హౌసింగ్ (ప్రధానమంత్రి ఆవాస్ యోజన) 8వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పథకం ప్రారంభించి 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని జగనన్న కాలనీని హౌసింగ్ డీఈఈ జి. మురళీమోహన్, నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీప్రసాద్, ఏఈఈ ఆర్. పవన్ సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ, కాలనీలో కల్పించాల్సిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఇంతవరకు నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ ఆనంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాము, నగర పంచాయతీ ఏఈ త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'జగనన్న సురక్ష'



విజయనగరం: నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకం నగరంలో పకడ్బందీగా చేపట్టాలని నోడల్ అధికారులకు నగర పాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు ఆదేశించారు. ఈ మేరకు కమిషనర్ చాంబర్‌లో శనివారం ఏర్పాటు చేసిన నోడల్ అధికారుల సమావేశంలో పథకం వివరాలు, నిర్వహించాల్సిన విధానాలను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలు లబ్ధిదారులకు అందేలా చూడాల్సిన బాధ్యత నోడల్ అధికారులపైనే ఉందన్నారు. 24 నుంచి ఈ నెలాఖరు వరకు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కార్యక్రమం ఆవశ్యకత, అవసరాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. జూలై 1 నుంచి పథకం అమలులో భాగంగా ధ్రువపత్రాలు అందజేయాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

17వ డివిజన్‌లో ప్రారంభం..

విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఆదేశాల మేరకు నగరంలోని 17వ డివిజన్‌లో శనివారం చేపట్టారు. 20వ సచివాలయం పరిధి మేదరవీధిలో ఇంటింటికీ వెళ్లి కార్యక్రమం ఆవశ్యకతను వివరించారు. ధ్రువపత్రాలు కావాల్సిన వారి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేటర్ ఆశపు సుజాత, సచివాలయ కన్వీనర్లు ముద్దాడ ఆదినారాయణ, గుండు వీరభద్రయ్య, గృహసారథులు కోండ్రు చిన్న, జరజాపు అప్పలనాయుడు, బూర శ్రీను, వెంపటి లక్ష్మి, వార్డు నాయకులు నామాల సర్వేశ్వరరావు, కంటుభుక్త అరుణ్‌కుమార్, కాళ్ల గోపి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పూసపాటిరేగ : జగనన్న సురక్షపై సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్, తదితరులు

ప్రజల వద్దకే పాలన..

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో ప్రజల వద్దకే పాలన చేరుతోందని జెడ్పీటీసీ సభ్యుడు, జేసీఎస్ మండల కన్వీనర్ గదల సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని చిన్న బూరాడపేటలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో సుపరిపాలన ప్రారంభమైందన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా అందజేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను శతశాతం నెరవేర్చడంతో ప్రజాప్రతినిధులుగా గ్రామాల్లో సగర్వంగా తిరగగలుగుతున్నామన్నారు. ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బెల్లాన రామారావు, కోట్ల సత్యం, సత్యారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



విజయనగరం: వివరాలు సేకరిస్తున్న గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు



నెల్లిమర్ల రూరల్: బూరాడపేటలో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు

అర్హులకు సంక్షేమ పథకాలు..

పూసపాటిరేగ : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలని ఎంపీడీఓ జి.రామారావు అన్నారు. మండలంలోని కనిమెల్లలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి అవగాహ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పేదవాడికీ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై ఒకటో తేదీ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని.. ఇప్పటికే గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇ.భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసురావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం..

- వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు ప్రత్యేక బృందం



కాలువల్లో పూడికలు తొలగిస్తున్న ప్రత్యేక పారిశుధ్య సిబ్బంది

విజయనగరం: వేసవి ముగిసింది.. వర్షాకాలం ప్రారంభమైంది.. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రానున్న రోజుల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. భారీ వర్షాలు కురిసే సమయంలో ముంపు సమస్యకు తావు లేకుండా చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా నగరంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక బృందాన్ని నియమించారు. ప్రధాన ప్రాంతాల్లో గల కాలువల్లో జేసీబీ, బాబ్‌కాట్ యంత్రాలతో పేరుకుపోయిన పూడికలు తొలగిస్తుండగా.... చిన్న చిన్న సందుల్లో, ఇళ్ల పక్కన ఉన్న చిన్న కాలువలలో చెత్తా,చెదారాలను తొలగించేందుకు ప్రత్యేక పారిశుధ్య బృందాలతో ప్రక్షాళన చేపడుతున్నారు. మూడు నెలల పాటు చేపట్టనున్న ప్రత్యేక పారిశుధ్య విధానంలో రాకోడుకి చెందిన 20 మంది కార్మికులను నియమించినట్లు కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు తెలిపారు. ప్రజలందరూ సహకరించి మెరుగైన పారిశుధ్యానికి కృషి చేయాలన్నారు. ఎక్కడబడితే అక్కడ చెత్త, చెదారాలను వేయవద్దని సూచించారు. మూడు బుట్టల విధానంపై మరింత అవగాహన పెంచుకొని మీ ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు చెత్తలను వేరు చేసి ఇవ్వాలని కోరారు.

ఇబ్బందులు లేకుండా...

ప్రత్యేక బృందాలు సర్కిళ్ల వారీగా విధులు నిర్వహిస్తాయి. ప్రతి సర్కిల్ నుంచి ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్, డ్రైవర్, పది మంది పారిశుధ్య కార్మికులు సిద్ధంగా ఉంటారని కమిషనర్ శ్రీరాములనాయుడు తెలిపారు. వర్షాలు కురిసే సమయంలో నీరు నిల్వ లేకుండా చెరువుల్లో, కుంటలలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా ప్రత్యేక బృందాలు యుద్ధ ప్రాతిపదికన కృషి చేస్తాయన్నారు. అలాగే లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి నీరు నిల్వ లేకుండా ఏర్పాట్లు చేస్తారన్నారు.

అభివృద్ధికి ముందుకు రావాలి



పారిశుధ్య కార్మికులకు డబ్బాలు అందజేస్తున్న చైర్‌పర్సన్, తదితరులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ అభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్‌చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు పిలుపునిచ్చారు. మిమ్స్ ఆర్థిక సహకారంతో కొనుగోలు చేసిన రూ. 2.06 లక్షల విలువైన చెత్త సేకరణ డబ్బాలను స్థానిక కార్యాలయంలో నగరపంచాయతీ పారిశుధ్య కార్మికులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగర పంచాయతీ అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. పట్టణాన్ని మరింత అభివృద్ధిపథంలో నడిపించడానికి సంస్థలు, దాతలు సహకారం అందించాలని కోరారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణకు మిమ్స్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కమిషనర్ పి. బాలాజీప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మేనేజర్ విశ్వేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాము, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు సహకరించాలి



మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

పూసపాటిరేగ: మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని భోగాపురం ఎస్ఈబీ ఎస్సై ఇ. రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీనివాస పాలిటెక్నికల్ కళాశాలలో సీఐ ఎంఆర్‌వీఆర్ అప్పారావు ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై సమాచారం తెలిసిన వారు తమకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పతివాడ రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

'గురజాడ' మరిన్ని విజయాలు సాధించాలి..

విజయనగరం పూల్‌బాగ్: సమాజంలో నైతిక విలువలు దిగజారుతున్న సందర్భంలో గురజాడ సీనియర్ విద్యార్థులంతా మంచి పౌరులుగా తీర్చిదిద్దబడడం గురజాడ పాఠశాల ఇచ్చిన పునాదుల ప్రభావమేనని కేంద్ర మాజీ మంత్రి పి. అశోక్‌గజపతిరాజు అన్నారు. శనివారం స్థానిక గురజాడ స్కూల్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ, 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురజాడ పాఠశాల మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలన్నారు. ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు మాట్లాడుతూ, గురజాడ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులంతా గురజాడ రచనలు పూర్తిగా చదవాలన్నారు. ఆ మహాకవి చూపించిన దేశభక్తిని అలవరచుకోవాలని సూచించారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత సీవీ రాజుని సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల గౌరవ డైరెక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, కరస్పాండెంట్ ఎం. స్వరూప, హెచ్‌ఎం పి. శేఖర్ పాల్గొన్నారు.

జూలై 1 నుంచి 'జగనన్న సురక్ష'

నెల్లిమర్ల: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పుష్పలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు రెండు టీమ్‌లుగా ఏర్పడి 16 సచివాలయాల్లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఒక టీమ్‌లో ఎంపీడీఓ గిరిబాల, డీటీ శైలజ, జూనియర్ అసిస్టెంట్ సర్వేశ్వరరావు ఉంటారన్నారు. మరో టీమ్‌లో తహసీల్దార్ కేవీ రమణరాజు, ఈఓపీఆర్‌డీ భానోజీరావు, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ ప్రసన్నకుమార్ ఉంటారని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. 1వ తేదీన అలుగోలు, బూరాడపేట సచివాలయాల్లోను.. 4న బొప్పడాం, చంద్రంపేట.. 6న గుషిణి, కొండగుంపాం.. 11న జోగిరాజుపేట, కొండవెలగాడ.. 14న ఒమ్మి, మొయిద.. 18న సారిపల్లి, రామతీర్థం.. 20న సతివాడ, సీతారామునిపేట.. 25న వల్లూరు, తంగుడుబిల్లి గ్రామాల్లో అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. 11 రకాల సేవలకు సంబంధించి ధ్రువపత్రాలు జారీ చేయడం జరుగుతుందన్నారు.